# అనుభూతి

-ఎస్. డి.వి. అజీజ్




"రేయ్ సుందరం!"

"మీరూ!"

"నేన్రా! నాగభూషణాన్ని... నీ చిన్న నాటి స్నేహితుణ్ణిరా! ఏంటీ ఇంకా గుర్తు పట్టలేదా? అవున్లే. కలుసుకుని చాలా ఏళ్ళయ్యింది కదూ! ఎలా గుర్తుంటాను? నువ్వయినా గాని ఎలా గుర్తు పడతావులే!"

"హోరి ఓరి! భూషణమా!నువ్వారా..."

"సంతోషం ఇప్పటికైనా గుర్తొచ్చినందుకు! ఈ సిటీలో ఉద్యోగం చేస్తున్నావని వినడం మాటే గాని, స్కూల్ ఫైనల్ అయ్యాక...నిన్ను చూపింది ఇప్పుడే! నేమా వెంటనే గుర్తు పట్టలేక పోయా ననుకో! అదిగో..నీ నుదిటి మీద మచ్చుంది చూడూ! అది చూశాకే నువ్వే అనుకున్నాను. ఏవిటీ విశేషాలు? ఎలా వున్నావు?"

"నాకేం బాగానే వున్నాను. నువ్వెలా వున్నావు?

"చూస్తూనే వున్నావుగా! నీ అంత నాజూగ్గా తయారవ లేకపోయినా ఏదో పంచె కట్టులో ఇలా వున్నాను. పెళ్ళయ్యిందని విన్నాను. పిల్ల లెంతమందిరా?"

"ఒకబ్బాయి..ఒకమ్మాయి".

"ఇద్దరితో ఫుల్‌స్టాప్ పెట్టేశావన్నమాట! పిల్లలేం చదువుతున్నారు?"

"అబ్బాయి ఎయిత్ స్టాండర్డ్. అమ్మాయి ఫిఫ్త్ స్టాండర్డ్".

"ఇంగ్లీషు చదువులేనా?"

"ఆ! ఇంగ్లీషు చదువులే!"

"తెలుగు కూడా వుంటుందా?"

"ఉహూ! సెకెండ్ లాంగ్వేజీ హిందీ. ఈ కాలంలో తెలుగు చదువు దేనికి పనికొస్తుంది చెప్పు? అంతా ఇంగ్లీష్ మయం. అది సరే! నీ గురించి చెప్పనే లేదు? ఏం చేస్తున్నావ్?"

"నీలా నాకెక్కువ చదువు అబ్బలేదు. స్కూల్ ఫైనల్ అయ్యాక మా నాన్న నన్ను వ్యవసాయం లోకే దింపాడు. అదే కొనసాగిస్తున్నాను".

"పెళ్ళయ్యిందా?"

"ఆ! ముగ్గురు పిల్లలు. ఇద్దరమ్మాయిలూ, ఒక అబ్బాయీ".

"ఏం చదువుతున్నారు?"

"మనం చదువుకున్న బళ్ళోనే! పెద్దమ్మాయి ఏడో క్లాసు. రెండో అమ్మాయి అయిదో క్లాసు. అబ్బాయి మూడు.".

"అక్కడెందుకు చేర్పించావు? శుభ్రంగా పట్నం తీసుకొచ్చి ఏదైనా కాన్వెంట్ స్కూల్లో చదివించలేక పోయావా?"

"చదువు పట్ల శ్రద్ధ వుండాలే గాని ఎక్కడ చదివినా ఒకటే! అది సరే. నీ నివాసమెక్కడ?"

"వనస్థలిపురం".

"దగ్గరేనా?"

"దాదావు పది కిలోమీటర్లు వుంటుంది".

"సొంతిల్లా?"

"అంత సీను లేదులే! బాడుగిల్లే ".

"అంత దూరమెందుకు వెళ్ళావు? ఆఫీసుకి దగ్గర్లోనే ఇల్లు అద్దెకు తీసుకోక పోయావా?"

"తీసుకోవచ్చు గానీ అద్దె రెండు వేలకు పైగా వుంటుంది. నా జీతంలో సగం అద్దెకు పోతే, ఇంక సంసారాన్నెలా పోషించను?"

"అక్కడెంత?"

"అయిదొందలు".

"రోజూ సిటీ బస్సుల కోసం పడిగావులు కాయాల్సిందేనా?"

"తప్పదు కదా? ఉదయం తినీ తినక హడా విడిగా బయల్దేరి రావటం..ఆఫీసయ్యాక తిరిగి ఇలా పడిగావులు కాసి కొంపకు చేరటం! నువ్వేం పని మీద వచ్చావు?"

"మా వూరతనికి అనారోగ్యంగా వుంటే, ఇక్కడి నిజాం హాస్పిటల్లో చేర్పించాను. చూసి వెళ్దామని వచ్చాను. అక్కణ్ణుంచి తిన్నగా నడుచుకుంటూ వస్తుంటే...ఇదిగో నువ్వు కన్పించావు".

"నిన్ను కలుసుకున్నందుకు చాలా ఆనందంగా వుందిరా సుందరం. మన చిన్ననాటి విషయాలన్నీ జ్ఞప్తికి వస్తున్నాయి".

"నీకు వేరే పనేం లేకుంటే...నా వెంటరా. మా ఇంటికెళదాం".

"ఈ సిటీ బస్సులోనా? నా వల్ల కాదు. ఆటోలో వెళదాం".

"బోలెడవుతుంది".

"కానీ. ప్రతి సారీ ఖర్చు పెట్టలేంగా!"

"నా దగ్గర బస్ పాసుంది. అదీ గాక నెలాఖరు".

'నాకర్థమయ్యింది లేరా! ఆటో ఛార్జి నేనే పెట్టుకుంటాను".

'పద...ఆటో..?

* * *

"ఇదేరా నేనుంటున్న ఇల్లు. ఎలా వుంది?"

"ఫర్వా లేదు".

"కుర్చో!"

"ఝాన్సీ..ఝాన్సీ.."

"ఆ వస్తున్నా! 'ఏమిటి పిలిచారు?"

"ఇతను నాగభూషణం అని నా చిన్ననాటి స్నేహితుడు. స్కూల్ ఫైనల్ వరకూ ఇద్దరం కలిసి చదువుకున్నాం. అనుకోకుండా సిటీ బస్టాప్ దగ్గర తారసపడ్డాడు. తీసుకొచ్చాను".

"నమస్కారమండీ!"

"నమస్కారం...పిల్లలేర్రా?"

"లోపల చదువుకుంటునట్టున్నారు. సుధీర్.. అమలా!"

"ఇలా రండి. అంకుల్‌కు నమస్తే చెప్పండి"

"నమస్తే అంకుల్".

"అంకులేమిటయ్యా! అంకుల్. ఎంచక్కా మావయ్యా అని చెప్పించొచ్చు గదా! 'ఎంట్రా నవ్వుతావు?"

"నవ్వక 'ఏముందిరా? ఈ కాలంలో మావయ్యా అని పిలిచేదెవరు?"

"అడిగి పిలిపించుకున్నా, ఈ సిటీ వాతావరణానికి అలవాటు పడిన పిల్లలు పిలవరు. మీరెళ్ళి చదువుకోండి. ఝాన్సీ! మా ఇద్దరికీ కాఫీలు తీసుకురా!"

"ఇప్పుడు కాఫీ దేనికిరా! ఇంకాసేపాగి భోంచేద్దాం!".

"మా ఇంట్లో భోజనం పదింటికి. అంత వరకూ ఆగలేకే కాఫీ లాగించేస్తుంటాను. నువ్వు తీసుకురా ఝాన్సీ!"

"పిల్లలు చదువుపై బాగా శ్రద్ధ చూవుతున్నట్టున్నారు!"

"తండ్రిగా పొగడ్డం కాదనుకో! ఇద్దరూ యమా ఇంటిలిజెంట్స్. ఉదయం ఆరింటి నుంచి ఎనిమిదింటి వరకు పక్క కాలనీలో ట్యూషన్. పదింటి నుంచి స్కూల్. మళ్ళీ సాయంకాలం ట్యూషన్. మళ్ళీ చదువు".

"ఎప్పుడూ చదువైతే మరి ఆటలాడుకునేదెప్పుడా?"

"ఆడుకునేం చేయాల్రా? చదువు ముఖ్యం గాని, అబ్బాయిని ఇంజనీర్‌గా, అమ్మాయిని డాక్టర్‌గా చేయాలన్నదే నా ఆశయం".

"ఆశయం మంచిదే కాని మరీ చదువు పేరిట ఇలా వాళ్ళకి బాల్యానికి సంబంధించిన అనుభూతులు లేకుండా చేయడం అన్యాయం! ఎన్నో 'ఏళ్ళ తర్వాత కలుసుకున్నాం. ఆటోలో వస్తూ, చిన్నతనాన మనం చేసిన చిలిపి పనులు, కొంటెతనాలు...ఎన్నో గుర్తుకు తెచ్చుకని నవ్వుకున్నాం. ఆ అనుభూతిని మళ్ళీ కలసి పంచుకున్నాం. అనుభూతి లేని జీవితం వృధారా సుందరం! నవ నాగరికత పేరిట, ఈ కాన్వెంటు చదువుల పేర, పిల్లలపై మనం పెంచుకున్న ఆశయాల పేరిటా వారిని బాల్యపు అనుభూతుల నుంచి దూరం చేస్తున్నాం. రేయ్ సుందరం! 'ఏ అనుభూతికీ లోను కాకుండా యాంత్రికంగా పెరగటం వల్లేరా...ఇప్పటి యువతరానికి అనుబంధాల పట్ల అణుమాత్రం కూడా గౌరవం




లేకుండా పోయింది. పెరిగి పెద్దయ్యి, ప్రయోజకులైనా, కని పెంచిన తల్లిదండ్రులను సైతం తేలిగ్గా మరచి పోగలుగుతున్నారు. తమకు అడ్డమనుకుంటే వృద్ధాశ్రమాల్లో చేర్పించడానికి సైతం వెనుకాడ్డం లేదు. ఇదంతా వారి తప్పు కాదు. తల్లిదండ్రులుగా మన తప్పే! వారిని ప్రయోజకులుగా చేయడమే సరికాదు. అనుబంధాల విలువ కూడా నేర్పాలి. అలా నేర్పాలంటే, చదువుతో పాటు వారికి అనుభూతిని పొందే అవకాశం కూడా కల్పించాలి! అలా కల్పించడం తల్లిదండ్రుల ముఖ్య బాధ్యతరా! ఆలోచించూ!" అంటూ వాడు నాకు క్లాస్ తీసుకున్నాడు. భోజనం చేశాక వాడు వెళ్ళిపోయాడు.

* * *

"సుధీర్, శ్యామలా ఇలా రండి! ఈ రోజు నుంచి సాయం కాలం పూట ట్యూషన్ బంద్. స్కూల్ కాగానే వచ్చి ఆడుకోండి. కాలనీలోని మీ తోటి పిల్లలతో కలసి ఆడుకోండి. నో అబ్జెక్షన్".

"'ఏంటండీ మీరూ! అలా వాళ్ళను గాలికొదిలేస్తే పాడయిపోరూ!" అంది ఝాన్సి.

"పాడయిపోరు. బాగుపడతారు. పిల్లలూ మీరెళ్ళి ఆడుకోండి".

పిల్లలు "థ్యాంక్యూ డాడీ"అంటూ స్వేచ్ఛా విహంగాల్లా దూసుకెళ్ళారు ఆడుకోవడానికి.